సాక్షి నంద్యాల

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024

పసుపు గణపతి



మద్దికెర: వినాయక చవితిని పురస్కరించుకుని మద్దికెర కొండమ్మబావి యూత్ సభ్యులు 25 కిలోల పసుపుతో గణేశుడి విగ్రహాన్ని తయారు చేయించారు. పర్యావరణ హితంగా విగ్రహాన్ని రూపొందించినట్లు వారు తెలిపారు.

స్మార్ట్ మీటర్ ఏర్పాటు



కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సంతోష్‌నగర్‌లోని ఉర్దూ పాఠశాలకు బుధవారం విద్యుత్‌శాఖ అధికారులు స్మార్ట్ మీటర్ బిగించారు. రానున్న రోజుల్లో అన్ని కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించనున్నారు.

టీబీ డ్యాం సమాచారం



పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.92
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:101.461
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 39,945
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:35,235

న్యూస్‌రీల్

పవర్ హౌస్‌లో ప్రమాదం జరగలేదు



కుడిగట్టు జల విద్యుత్ కేంద్రం (ఫైల్)

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో ఎలాంటి ప్రమాదం జరగలేదని చీఫ్ ఇంజినీర్ కాంతారావు బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి విద్యుత్‌ఉత్పాదన సమయంలో 220 కేవీ స్విచ్‌యార్డ్‌కు విద్యుత్‌ను సరఫరా చేసే సమయంలో కండెక్టర్లకు నీటితడితో కూడిన చెట్లు వాటిపై వాలడంతో ఆటోమేటిక్‌గా 7వ జనరేటర్ ట్రిప్ అయ్యిందన్నారు. ఇటువంటి సమస్యలు ఎదురుకావడంతో స్విచ్‌యార్డ్ బ్రేకర్ల నుంచి పెద్ద శబ్దాలు రావడం సహజమన్నారు. డ్యాం గేట్లు పూర్తిగా బుధవారం మూసివేయడంతో కుడిగట్టు కేంద్రంలో ఉన్న 7 జనరేటర్లు విద్యుత్ ఉత్పాదన చేస్తున్నాయన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు నేడు అవార్డులు ప్రదానం

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల సేవలను గుర్తించి ఏటా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 59 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో సత్కరించనున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

దివ్యాంగులకు సబ్సిడీపై పెట్రోల్, డీజిల్

నంద్యాల(అర్బన్): సబ్సిడీపై పెట్రోల్, డీజిల్ కోసం జిల్లాలో మూడుచక్రాల వాహనం కలిగిన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లాల అధికారిణి రెయిన్ ఫాతిమా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు ఫారంతో పాటు సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, వ్యాపారం చేసే ధ్రువీకరణ పత్రం, లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రం అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్- 08518277864 ను సంప్రదించాలన్నారు.

నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

నంద్యాల(అర్బన్): వినాయక నిమజ్జన మహోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో వినాయక నిమజ్జన మహోత్సవ ఏర్పాట్లపై అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 11న చిన్న చెరువు కట్ట వద్ద ఉన్న వినాయక ఘాట్‌లో వినాయక నిమజ్జన ఏర్పాట్లకు పనులు జరుగుతున్నాయన్నారు. గణేష్ విగ్రహాల ఊరేగింపులో భారీ పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. ఊరేగింపులో డ్రమ్స్, డీజే వాడరాదన్నారు. సమావేశంలో నంద్యాల, ఆళ్లగడ్డ డీఎస్పీ లు యుగంధర్ బాబు, రవికుమార్, కేంద్ర గణేష్ మహోత్సవ కమిటీ సభ్యులు రామకృష్ణారెడ్డి, విజయ్ కుమార్, నిమ్మకాయల సుధాకర్, నాగేంద్ర, శంకర్, పుల్లయ్య పాల్గొన్నారు.



> ఒకటిన్నర ఎకరాల్లో మిరప కొట్టుకు పోయింది

ఈ ఖరీఫ్‌లో రెండు ఎకరాల్లో ఎండుమిర్చి సాగు చేశాం. ఆగస్టు నెలలో కొత్తాళంలో కుండపోత వర్షం కారణంగా ఉపరాలవంక పొంగిపొర్లింది. నీరు మా పొలంపై పారడంతో ఒకటిన్నర ఎకరాల్లో మిర్చి పంట పూర్తిగా కొట్టుకుపోయింది. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాం. అధిక వర్షాలతో రూ.45 వేల వరకు నష్టం వాటిల్లింది. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అధిక వర్షాలతో పంటలకు నష్టం జరిగితే నెల రోజుల్లోపే పరిహారం అందించింది. కూటమి ప్రభుత్వం కూడా అదేవిధంగా స్పందించాలి.

– పింజరి రాజాసాహెబ్, కొత్తాళం

వర్షాలు సకాలంలో కురవడంతో రైతులు సంతోషించారు. పంటలు పచ్చగా ఉండటంతో సంబరపడ్డారు. ఈ సీజను కాసులు పండిస్తుందనే ఆనందంలో ఉండగా అధిక వర్షాలు ఆశలపై నీళ్లు చల్లాయి. మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో తేమ అధికమై పంటలు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. దెబ్బతిన్న పంటల విషయంలో కూటమి ప్రభుత్వం నోరు మెదపక పోవడం చూస్తే రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. 2023–24 రబీ కరువు రైతులకు ఇప్పటికీ పరిహారం చెల్లించకపోవడంతో.. తాజా పంట నష్టానికి పెట్టుబడి రాయితీ చెల్లిస్తుందో లేదోననే బెంగ అన్నదాతను వెంటాడుతోంది.



భారీ వర్షాలతో నీట మునిగి దెబ్బతిన్న పత్తి పంట (ఫైల్)

పొలాల్లో కన్నీళ్లు!

అధిక వర్షాలతో భారీగా పంట నష్టం

- ఉమ్మడి జిల్లాలో 44,950 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- 19,911 మంది రైతులకు తీరని నష్టం
- ఇప్పటి వరకు ఊసేలేని ఎన్యూమరేషన్
- గత రబీ పంట నష్టం విషయంలోనూ నిర్లక్ష్యం
- ఇన్‌పుట్ సబ్సిడీ విషయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ
- నెల నుంచి రెండు నెలల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధిక వర్షాల వల్ల 44,950 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. వర్షాల ప్రభావం కర్నూలు జిల్లాలో 11 మండలాల్లోని 72 గ్రామాల్లో.. నంద్యాల జిల్లాలో 16 మండలాల్లోని 108 గ్రామాల్లో ఉంది. వ్యవసాయ పంటలు వరి, పత్తి, వేరుశనగ, కంది, ఆముదం, సజ్జ, కొర్ర, మినుము, ప్రొద్దుతిరుగుడు, పొగాకు, సోయాబీన్, మొక్కజొన్న పంటలు కర్నూలు జిల్లాలో 16,235 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. ఇందులో 2,058 ఎకరాల ఉద్యానపంటలు ఉన్నాయి. 7,220 మంది రైతులు పంటలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నారు. నంద్యాల జిల్లాలో అధిక వర్షాలతో పంట నష్టం మరింత భారీగా ఉంది. నంద్యాల జిల్లాలో 28,715 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వీటిల్లో ఉద్యాన పంటలు 202 ఎకరాలు. నంద్యాల జిల్లాలో అధిక వర్షాలతో 12,800 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉమ్మడి జిల్లాలో ఉద్యాన పంటలు ప్రధానంగా మిర్చి, ఉల్లి, ఇతర కూరగాయల పంటలకు భారీగా నష్టం చేకూరింది. వాస్తవంగా వర్షాలకు భారీగా పంట నష్టం జరిగినప్పటికీ వ్యవసాయ, ఉద్యాన అధికారులు ప్రాథమికంగా పంట నష్టాన్ని తక్కువ చూపినట్లు తెలుస్తోంది. ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆగస్టు నుంచి జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్నాయి. పంటలకు భారీగా నష్టం జరిగింది. కానీ ఇంతవరకు ఎన్యూమరేషన్ ఊసే లేదు. ఇక పరిహారం ఎప్పటికి ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం

2014–15 నుంచి 2018–19 మధ్య వరుసగా నాలుగేళ్లు కరువు వచ్చింది. ఏ సంవత్సరంలో కూడా అదే వ్యవసాయ సీజన్‌లో టీడీపీ ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసిన దాఖలాలు లేవు. 2014 ఖరీఫ్‌లో కరువు మండలాలను ప్రకటిస్తే 2016లో ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలైంది. 2017–18లో ఖరీఫ్, రబీ సీజన్‌లలో కూడ కరువు మండలాలను ప్రకటించినప్పటికీ 2019 ఏప్రిల్ వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించని పరిస్థితి. రైతులను ఆదుకోవడంలో టీడీపీ మొదటి నుంచి అంతులేని నిర్లక్ష్యం చూపుతోంది.

ఐదేళ్లలో ఉదారంగా స్పందించిన వైఎస్సార్‌సీపీ

గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అధిక వర్షాల వల్ల పంటలకు నష్టం కలిగితే కేవలం నెల నుంచి రెండు నెలల్లోనే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించింది. నష్టం జరిగిన కొద్ది రోజుల్లోనే ఎన్యూమరేషన్ చేపట్టడం, ఆ వెంటనే అధికార యంత్రాంగం ప్రభుత్వానికి రిపోర్టు పంపడం, ఆ వెంటనే రైతుల బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించడం జరిగిపోయింది. ఫలితంగా నష్టపోయిన రైతులకు భరోసా లభించింది.

అతీగతీ లేని 2023–24 రబీ కరువు పరిహారం

- వర్షాలు లేకపోవడంతో 2023–24 రబీ సీజన్ భారీగా దెబ్బతీసింది.
- కర్నూలు జిల్లాలో 54,382, నంద్యాల జిల్లాలో 37,208 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్చి నెల 15న కర్నూలు జిల్లాలో 18, నంద్యాల జిల్లాలో 12 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది.
- ఎన్నికల కోడ్ రావడంతో ఎన్యూమరేషన్ ప్రక్రియ జరుగలేదు.
- పోలింగ్ అనంతరం ఈ–క్రాప్ డేటా ఆధారంగా ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఆయా జిల్లాల యంత్రాంగం ప్రభుత్వానికి నివేదికలు పంపాయి.
- రబీ కరువు మండలాల్లో సెంట్రల్ టీమ్ కూడా పర్యటించింది.
- రూ.163.85 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు నివేదిక కూడా ఇచ్చింది.
- అయితే ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల ఇప్పటి వరకు ప్రశ్నార్థకంగా మారింది.

అధిక వర్షాలతో ఉమ్మడి జిల్లాలో పంట నష్టం ఇలా..

పంట	కర్నూలు (ఎకరాల్లో)	నంద్యాల
వరి	1,537.5	947.5
పత్తి	7,825	242.5
వేరుశనగ	630	-
కంది	3,940	972.5
ఆముదం	42.5	27.5
సజ్జ	195	-
మినుము	1.25	960
ప్రొద్దుతిరుగుడు	5	-
మొక్కజొన్న	-	24,602.5
సోయాబీన్	-	310
కొర్ర	-	247.5
పొగాకు	-	202.5
ఉద్యానపంటలు	2,058.75	202.5
మొత్తం	16,235	28,715

గత రబీలో కరువు మండలాలు

కర్నూలు జిల్లా: ఆదోని, ఆలూరు, ఆస్పరి, సి.బెళగల్, చిప్పగిరి, గూడూరు, హాలహర్వి, హొళగుంద, కల్లూరు, కోడుమూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, మంత్రాలయం, పత్తికొండ, తుగ్గలి, వెల్దుర్తి, ఓర్వకల్లు.

నంద్యాల జిల్లా: ఆళ్లగడ్డ, గోస్పాడు, గడివేముల, బనగానపల్లి, ఉయ్యాలవాడ, సంజామల, అవుకు, నందికొట్కూరు, మిడుతూరు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, దొర్నిపాడు, నంద్యాల.



దిశానిర్దేశం

తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో రాజకీయ పరిస్థితుల గురించి వైఎస్ జగన్ ఆరా తీశారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, రామిరెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, నందికొట్కూరు నేత ధారా సుధీర్ ఉన్నారు.

ఉప్పొంగిన కుందరవాగు

ఉయ్యాలవాడ: మండలంలోని ఆళ్లగడ్డ–మాయలూరు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో ఇంజేడు గ్రామ సమీపంలోని కుందరవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో బుధవారం ఈ రహదారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జిల్లాలో గోస్పాడు, కోవెలకుంట్ల, దొర్నిపాడు మండలాలతో పాటు మండలంలో కూడా మంగళవారం రాత్రి భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు, పంట పొలాల్లోని నీరంతా కుందరవాగులోకి వచ్చి చేరుతుండటంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. సాయంత్రం తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి వాగు ఉధృతిని పరిశీలించారు. వాగును దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు సూచించారు.



ఇంజేడు గ్రామ సమీపంలో కుందరవాగు వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు

తెరిపివ్వని వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో వర్షం ఎడతెరిపినివ్వకుండా కురుస్తూనే ఉంది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రుద్రవరం మండలంలో అత్యధికంగా 43.4 మి.మీ వర్షం కురవగా చాగలమర్రి అత్యల్పంగా 2.4 మి.మీ వర్షం కురిసింది. బనగానపల్లెలో 38.2, ఆళ్లగడ్డలో 38.0, పాణ్యంలో 37.2, శిరివెళ్లలో 36.0, కోవెలకుంట్ల 32.0, పాములపాడు 31.8, నంద్యాల 28.8, గోస్పాడు 28.2, గడివేముల 25.6, మహానంది 24.8, నందికొట్కూరు 24.0, దొర్నిపాడు 23.0, మిడుతూరు 22.6, ఆత్మకూరు 22.4, పగిడ్యాల, వెలుగోడు 20.8,కొత్తపల్లి 18.6, జూపాడుబంగ్లా, బండిఆత్మకూరు 16.4, బేతంచెర్ల 16.2, సంజామల 11.6, ఉయ్యాలవాడ 6.4, అవుకు 5.6, డోన్ 3.4 మి.మీ చొప్పున వర్షం కురిసిందని సంబంధిత అధికారులు తెలిపారు.

కూలిన మట్టిమిద్దె



రుద్రవరం: ఐదు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల మట్టిమిద్దెలు కూలుతున్నాయి. మంగళవారం రాత్రి మరోసారి భారీగా వర్షం కురవడంతో మండలంలో 44 మి.మీ వర్షపాతం నమోదైంది. తిప్పారెడ్డిపల్లె, పెద్దకంబలూరు గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున రెండు మట్టి మిద్దెలు కూలిపోయాయి. క్షణాల్లో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. ఆయా గ్రామాల వీఆర్వోలు కూలిన మట్టి మిద్దెలను పరిశీలించారు.

ప్రతి రైతును ఆదుకుంటాం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు/ఆత్మకూరు రూరల్: వర్షాలకు పంట నష్టపోయిన ప్రతిరైతును ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మండలంలోని నల్లకాల్వ, కరివేన, కొత్త రామాపురం గ్రామాల పరిధిలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 6 వేల హెక్టార్లకు పైగా పంటలు దెబ్బతిన్నాయన్నారు. అత్యధికంగా ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల రైతులు నష్టపోయారన్నారు. వర్షాలు అధికంగా కురవడంతో వరదరాజస్వామి ప్రాజెక్టు, బవనాసి, సిద్ధాపురం చెరువులకు నీరు అధికంగా రావడం, పొలాల్లోకి వర్షపునీరు చేరడంతో పంటలు దెబ్బతిన్నాయన్నారు. మొక్కజొన్న పంట కంకి పెరగలేదన్నారు. ఈనెల 10లోగా పంటలు నష్టపోయిన రైతుల జాబితాను తయారు చేసి, 11న సచివాలయాల వద్ద ప్రదర్శిస్తామన్నారు. జాబితాను సరిచూసుకుని పేర్లులేని రైతులు వివరాలను అందజేస్తే వారి పేర్లను కూడా చేర్చుతామన్నారు. తుది జాబితాను ప్రభుత్వానికి పంపి పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, ఏడీఏ ఆంజనేయ, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

డీసీసీబీ ద్వారా రూ.330 కోట్ల రుణాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ద్వారా కొత్తగా రూ.330 కోట్ల రుణాల పంపిణీకి ఆప్కాబ్ బడ్జెట్ విడుదల చేసింది. ఇందులో రూ.20 కోట్లు పంట రుణాల పంపిణీకి వినియోగించనున్నారు. పంట రుణాలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) ద్వారా పంపిణీ చేస్తారు. ఉమ్మడి జిల్లాలో సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలుదారులకు రుణాల పంపిణీకి ఆప్కాబ్ రూ.10 కోట్లు విడుదల చేసినట్లు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి విజయకుమార్ తెలిపారు. ప్రస్తుతానికి పీఏసీఎస్‌కు రూ.కోటి, డీసీసీబీ బ్రాంచ్‌లకు మరో రూ.కోటి ప్రకారం బడ్జెట్ విడుదలైందన్నారు. 12.10 శాతం వడ్డీ రేటుతో దీర్ఘకాలిక రుణాలు కింద అర్హతను బట్టి గరిష్టంగా రూ.40 లక్షల వరకు రుణ సదుపాయం ఉంటుందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈఓ కోరారు.

నీటి విడుదలలో ఇంత నిర్లక్ష్యమా?

- ఇంజినీర్లు ఏం చేస్తున్నారు?
- వరద నీటితో చెరువులను నింపుకోవాలి కదా!
- పవర్‌గ్రిడ్ పనుల్లోనూ రాజకీయ జోక్యమా?
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- సమావేశాలకు ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే హాజరు





మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, హాజరైన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు

కర్నూలు(అర్బన్): '' శ్రీశైలం జలాశయం నీటిమట్టం 834 అడుగులు ఉన్నప్పుడే హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసుకోవచ్చు, కానీ 885 అడుగులకు వచ్చేంతవరకు ఎందుకు నీటిని విడుదల చేసుకోలేక పోయారు. 854 అడుగుల నీటి మట్టం ఉన్న సమయంలోనే పోతిరెడ్డిపాడుకు నీటిని విడుదల చేసుకునే అవకాశం ఉన్నా, 885 అడుగుల నీటి మట్టం వచ్చేంతవరకు ఎందుకు దిగువకు నీటిని విడుదల చేసుకోలేక పోయారు'' అంటూ నీటి పారుదల శాఖకు చెందిన ఇంజినీర్లపై జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. వరద నీరు వృథా కాకుండా కర్నూలు జిల్లాలోని 77 చెరువులను నింపుకోవాలని సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు ముగ్గురు ఎమ్మెల్యేలు జీ జయసూర్య, బీ దస్తగిరి, గౌరు చరితారెడ్డి, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నీటి పారుదల అంశంపై చర్చ జరిగిన సమయంలో చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాది ఇరిగేషన్ అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని, ప్రస్తుతం ఫ్లడ్ మేనేజ్‌మెంట్ సరిగా లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు.

రాజకీయ ఒత్తిళ్లతోనే పవర్‌గ్రిడ్ పనుల్లో రవాణా శాఖ జోక్యం

బలమైన రాజకీయ ఒత్తిళ్ల వల్లే కొలిమిగుండ్ల మండలం నందిపాడు వద్ద జరుగుతున్న పవర్‌గ్రిడ్ ప్రాజెక్టు పనుల్లో రవాణా శాఖకు చెందిన అధికారులు జోక్యం చేసుకున్నారని జెడ్పీ చైర్మన్ అన్నారు. ఇక్కడ కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాకు చెందిన కార్మికులు 600 నుంచి 800 మంది వరకు పనిచేస్తున్నారన్నారు. అయితే నంద్యాలకు చెందిన రవాణాశాఖ అధికారులు రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి సరైనా పత్రాలు లేవని అక్కడ పనిచేస్తున్న టిప్పర్లు, ఇటాచీ, ఎక్సకవేటర్లు, జేసీబీ, ఇతర వాహనాలను తీసుకువచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఉంచుకున్నారన్నారు. ఈ వాహనాలకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలు, విధించిన మేరకు అపరాధ రుసుము చెల్లించేందుకు వచ్చినా, ఎందుకు అపరాధ కట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రాజెక్టు పనులకు సంబంధించిన పలు ముఖ్యమైన వాహనాలు పది రోజులుగా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న కారణంగా పనులు నిలిచిపోయాయన్నారు.

సమావేశాల్లో ఎవరేమన్నారంటే ...

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఏడాది మార్చిలోగా గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను పూర్తి చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రబీ సీజన్ ప్రారంభం కాకముందే జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో శనగ విత్తనాన్ని సిద్ధంగా ఉంచాలన్నారు.
- నందికొట్కూరు ఎమ్మెల్యే జీ జయసూర్య మాట్లాడుతూ.. ప్రైవేటు డీలర్లు యూరియా బస్తాపై రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారని, ఎరువులు, విత్తనాల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు.
- కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ.. గూడూరు ఎస్సీ బాలికల వసతి గృహంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. 108 సర్వీసుల సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ.. పాణ్యం మండలంలో లోఓల్టేజి సమస్య ఉందని, చిన్నపాటి గాలికి కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందన్నారు.
- దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు వీ రామకృష్ణ మాట్లాడుతూ.. ఈదుల దేవరబండ నుంచి కప్పట్రాళ్ల వరకు రోడ్డును వేయాలన్నారు. నల్లచెలిమల చెరువును హంద్రీ–నీవా నీటితో నింపాలని కోరారు.
- సమావేశాల్లో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు కే నాగరాజు, బీ శ్రీధర్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ రామ్మోహన్, ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఐసీడీఎస్ పీడీ పీ వెంకటలక్ష్మమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బీ నాగేశ్వరరావు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సునీల్‌కన్నా, పీఐయు ఈఈ రామకృష్ణారెడ్డి, ఎస్‌హెచ్ ఈఈ శంకర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ భాస్కర్, ఐదో స్థాయీ సంఘం చైర్‌పర్సన్ పీ దివ్య, జెడ్పీటీసీ సభ్యులు బీ రఘునాథరెడ్డి, రామకృష్ణ, పులికొండనాయక్, సుధాకర్‌రెడ్డి, సుంకన్న, కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ప్రసన్నకుమార్, మౌలాలి, రంగనాథ్‌గౌడ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.